# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-10-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం పర్యటనలో భాగంగా భారత నౌకాదళం కోసం నిర్మిస్తున్న తొలి ఫ్లీట్ సపోర్ట్ షిప్‌ను రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు ప్రారంభిస్తారు.**

2. **స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

3. **దసరా, దీపావళి పండగల సందర్భంగా తెలంగాణలోని సింగరేణి కార్మికులకు ప్రోత్సాహకాలను ఇవ్వాలని నిర్ణయించినట్లు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు.**

4. **దేశ ఎన్నికల వ్యవస్థపై అవాస్తవ ప్రచారాలు సరికావని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా విశాఖలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో భారత నౌకాదళం కోసం నిర్మిస్తున్న తొలి ఫ్లీట్ సపోర్ట్ షిప్ – ఎఫ్ఎస్ఎస్–1ను రక్షణ మంత్రి ఈరోజు ప్రారంభిస్తారు. అలాగే ఎఫ్ఎస్ఎస్–5కు శంకుస్థాపన చేయడంతో పాటు ఆధునీకరించిన స్లిప్‌వే-4, 300 టన్నుల సామర్థ్యం కలిగిన గోలియత్ క్రేన్‌ను ప్రారంభిస్తారు. కాగా గత రాత్రి విశాఖకు చేరుకున్న రక్షణ మంత్రి నౌకాదళ సిబ్బందితో నిర్వహించిన బడా ఖానా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నైకాదళ సిబ్బందిని ఉద్దేశించి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ,

వాయిస్..30.. సెకన్లు

--------------------------

స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో సెర్ప్, మెప్మా అధికారులతో నిన్న నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, విజయవాడలో ఈనెల 15వ తేదీ నుంచి 31 వరకు నిర్వహించనున్న 'నేషనల్ సరస్ మేళా–2026'ను మహిళా సాధికారత చాటేలా విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం రియల్ టైమ్ గవర్నెన్స్ –ఆర్టీజీఎస్‌పై నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

ప్రభుత్వ ఉద్యోగుల సేవల్లో నాణ్యత పెంచడానికి.. వారి నైపుణ్యాల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలన్నారు.

---------------------------

ప్రధానమంత్రి ఆవాస్ యోజన–అర్బన్ 2.0 పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించింది. ప్రపంచ ఆవాస దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖాన్ సాహు ఈ అవార్డును రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి హెప్సిబా రాణికి అందజేశారు. ఈ అంశంపై గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పందిస్తూ ఇళ్ల నిర్మాణంలో వేగం, పారదర్శకత, లబ్ధిదారులకు నేరుగా నగదు బదిలీ, నిరంతర పర్యవేక్షణ వంటి చర్యలతో ఆంధ్రప్రదేశ్ దేశంలో అగ్రస్థానంలో నిలిచిందని తెలిపారు. 2029 నాటికి అర్హులైన పేదలందరికీ సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.

---------------------------

దసరా, దీపావళి పండగల సందర్భంగా తెలంగాణలోని సింగరేణి కార్మికులకు ఒక్కొక్కరికి లక్షా 10 వేల 250 రూపాయల చొప్పున ప్రోత్సాహకాలను ఇవ్వాలని నిర్ణయించినట్లు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. దేశానికి వెలుగులు పంచేందుకు పనిచేస్తున్న సింగరేణి కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే కాదని, తెలంగాణలో లక్షలాది కుటుంబాలకు జీవనాధారమని కిషన్‌రెడ్డి తెలిపారు. కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, భవిష్యత్తు కోసం యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం సింగరేణికి ఇవ్వాల్సిన 60 వేల కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేయాలని కిషన్‌రెడ్డి కోరారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలోని ఐతానగర్‌లో రెండు కోట్ల 13 లక్షల రూపాయల వ్యయంతో మూడున్నర ఎకరాల్లో అభివృద్ధి చేసిన స్వర్ణాంధ్ర పార్క్‌ను మంత్రి నిన్న ప్రారంభించారు. స్వర్ణాంధ్ర పార్కులు విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించడంతో పాటు, వృద్ధులకు ఆహ్లాదాన్ని కలిగించేలా ఉంటాయని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ..

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖలో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. విశాఖపట్నంలోని ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో 43 మందికి కారుణ్య నియామక పత్రాలను మంత్రి నిన్న అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లలో విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ సంస్థల్లో 445 మందికి పైగా కారుణ్య నియామకాలు కల్పించినట్లు చెప్పారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

దేశ ఎన్నికల వ్యవస్థపై అవాస్తవ ప్రచారాలు సరికావని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి నిన్న

మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాల రూపకల్పన రాజ్యాంగబద్ధంగా, పారదర్శకంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజల్లో అపోహలు కలిగించేలా ప్రచారాలు తగదని మంత్రి పేర్కొంటూ,

వాయిస్..30.. సెకన్లు

----------------------------

స్విట్జర్లాండ్‌తో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తామని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఢిల్లీలో స్విట్జర్లాండ్ ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి హెలెనా బుడ్లిగర్ ఆర్టియడాతో మంత్రి నిన్న సమావేశమై ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా స్విస్ రాయబార కార్యాలయం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్–స్విట్జర్లాండ్ బిజినెస్ ఫోరమ్‌లో పాల్గొని రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని ఏకగవాక్ష విధానంలో పారిశ్రామికవేత్తలకు సహకారం అందిస్తున్నామని చెప్పారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం పరిసర ప్రాంతాల్లో దిగువ ట్రోపో ఆవరణంలో ఆగ్నేయ, నైరుతి దిశల నుంచి గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో రానున్న రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

అలాగే తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈరోజు ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది.

----------------------------

తెలంగాణలో వృద్ధుల ఆరోగ్య సంరక్షణతో పాటు అసంక్రమిక వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. హైదరాబాద్‌లో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా, కుటుంబ ఆరోగ్య సంక్షేమ కమిషనర్ సంగీత మంత్రిని నిన్న కలిసి ఇటీవల చేపట్టిన జపాన్ పర్యటన వివరాలను వారు వివరించారు.

======================